సంపూర్ణ ఆరోగ్యమే సురక్ష లక్ష్యం


గైనిక్ సేవలు అందిస్తున్న డాక్టర్ దుర్గా కల్యాణి


వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ మోహన్‌కృష్ణ

- ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ ఉమావతి
- అన్నవరంలో ఆరోగ్య సురక్ష పైలట్ క్యాంప్

తగరపువలస: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమని వుమెన్ వెల్ఫేర్ ప్రతినిధి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి అన్నారు. భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష పైలట్ క్యాంప్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి 45 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖ హెల్త్ క్యాంప్‌లు నిర్వహించి ప్రజలకు సేవలు అందించనుందన్నారు. అందులో మార్పులు, చేర్పులు, లోపాలు సరిదిద్దుకోవడానికి ఈ పైలట్ క్యాంపు దోహదపడుతుందన్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా జరిపిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వివరాలు యాప్‌ల ద్వారా వలంటీర్లకు చేరాయన్నారు. దీంతో ప్రజల ఆరోగ్య పరిస్థితి వారికి తెలుస్తుందన్నారు. పంచాయితీలోని అన్ని గ్రామాల ప్రజలు వైద్యసేవలు పొందేందుకు 800 టోకెన్లు పంపిణీ చేయగా సాయంత్రం వరకు 229 మంది సద్వినియోగం చేసుకున్నారన్నారు.


వైఎస్సార్ పోషకాహార శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు

వీరికి మొత్తం 716 రక్త పరీక్షలు జరిపారని, 12 మందిని రిఫరల్ ఆస్పత్రికి తరలిస్తామన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 43 మందికి పరీక్షలు జరపగా వారిలో ఆరుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. 9 మంది క్షయ అనుమానితులకు కఫం పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

మెరుగైన వైద్యానికి నెట్‌వర్క్ ఆస్పత్రులకు

ప్రాథమికంగా హెచ్‌బీ, రక్తపోటు, మధుమేహం, డెంగ్యూ, మలేరియా, కంటి వైద్యం, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో 162 రకాల మందులు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు, 18 సర్జికల్ పరికరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అవసరమైన వారిని వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపిస్తామని డాక్టర్ ఉమావతి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ జీవనరాణి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ మోహన్‌కృష్ణ, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి శిబిరాన్ని పర్యవేక్షించారు. వైద్యాధికారులు ముప్పాళ్ల దుర్గా కల్యాణి, రవీంద్ర నాయక్, స్పెషలిస్ట్ వైద్యులు గోవింద్ (జనరల్ సర్జన్), మహమ్మద్ కొశల్ (పీడియాట్రిక్) వైద్య సేవలు అందించారు. వీరికి డీఎంహెచ్‌వో ఎంపీహెచ్ వరదా నారాయణరావు, తాళ్లవలస ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, పారా మెడికల్ సిబ్బంది సేవలు అందించారు. క్యాంపు ఆవరణలో వైఎస్సార్ పోషకాహార కిట్లు ప్రదర్శనలో ఉంచారు. ఈసీజీ తదితర సేవలు అందించడానికి 104 వాహనాన్ని, వైద్య పరీక్షలకు వచ్చే వారి కోసం మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు.

శిబిరాన్ని సర్పంచ్ మేరుగు సంతోషికుమారి, వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీలు సురపతి దుర్గాలమ్మ, బోని బంగారునాయుడు తదితరులు ప్రారంభించారు. క్యాంప్ ఇన్‌చార్జిగా ముప్పాళ్ల దుర్గా కల్యాణి వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మేరుగు ఎల్లాజీ, లచ్చుబుగత జగదీష్, సమ్మిడి శ్రీనివాసరావు, కొల్లి కోటిరెడ్డి, బొడ్డు దుర్గారావు, విశ్రాంత వీఆర్వో కొయ్య అప్పలసూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తామన్నారు



మూడేళ్లుగా మోకాలి నొప్పులతో బాధపడుతున్నా. కాళ్లు వాచిపోయాయి. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే ఆపరేషన్ చేస్తామన్నారు. అంత డబ్బులు చెల్లించుకోలేము. ఇప్పుడు మా గ్రామంలోకే డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి అవసరమైతే వారే మెరుగైన సేవలు అందిస్తామంటున్నారు.

– కుప్పు అప్పయ్యమ్మ

జగన్ బాబు అందిస్తున్న వైద్యం సూపర్



నాకు కొంత కాలంగా బీపీ, సుగర్ ఉంది. 104 వాహనం మా ఊరు వచ్చినప్పుడు పరీక్షించి మందులు ఇస్తున్నారు. ఇప్పుడేమే నలుగురు డాక్టర్లు మా గ్రామానికి వచ్చి అన్ని పరీక్షలు చేస్తున్నారు. గతంలో మేము సంచి డాక్టర్లపై ఆధారపడేవాళ్లం. ఇప్పుడు జగనన్న వైద్యం చాలా బాగుంది.

– సురపతి నూకాలమ్మ

మా దగ్గరకే డాక్టర్లు



మాకు ఒంట్లో ఎలాంటి నలత ఉన్నా భీమిలి, తగరపువలసలోని వైద్యుల వద్దకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు మా దగ్గరకే అన్ని విభాగాల డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. మా ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– ఉమ్మిడి లక్ష్మి

సర్వేలో అలసత్వం తగదు


జగనన్న సురక్ష సర్వే పరిశీలిస్తున్న జీవీఎంసీ జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, అధికారులు అలసత్వం వహించవద్దని జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి ఆదేశించారు. మధురవాడ పీహెచ్‌సీ పరిధిలోని బాపూజీనగర్‌లో ఏఎన్‌ఎమ్, ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న ఇంటింట సర్వేని మంగళవారం ఆమె పరిశీలించారు. సిబ్బంది ఏయే పరీక్షలు చేస్తున్నారు, ఏయే అంశాలు వివరిస్తున్నారో ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న ఇక్కడ నిర్వహించే మెగా మెడికల్ క్యాంప్‌కి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు అందరూ వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. 30న దుర్గానగర్, చంద్రంపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీ, పిలకవానిపాలెం, కళానగర్, పోర్టుకాలనీ, బాపూజీనగర్, శ్రీనివాసనగర్, స్వతంత్రనగర్, టైలర్స్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్, ప్రియదర్శిని కాలనీ వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని జెడ్పీ చెప్పారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీహెచ్‌వో సౌభాగ్యమణి పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.49 వేల జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న వారికి న్యాయస్థానం జరిమానా విధించింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న 14 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరచగా అందరికీ కలిపి మొత్తంగా రూ.49 వేల జరిమానా విధించారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌తో భేటీ


సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, శివ నందీష్

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం విశాఖ జోనల్ అధ్యక్షుడు ముత్తంశెట్టి శివ నందీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశం అనంతరం కలిశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ చెరువు అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. చెరువు చుట్టూ ఫెన్సింగ్, లైటింగ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఏఈ శ్రీధర్ పనులను పరిశీలించారు. త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్ ఉన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం


ఉత్సవమూర్తులతో ఆలయ అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన టీటీడీ అర్చకులు, వేద పండితులు అభిషేకాలు, పూజలు చేశారు.

కుక్కల పట్టివేత

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో మంగళవారం మధురవాడకు చెందిన కుక్కల శస్త్రచికిత్స సిబ్బంది కుక్కలను బంధించారు. గతంలో శస్త్రచికిత్స చేసిన వాటిని కాకుండా కొత్త వాటిని వలలతో బంధించారు. వీటిని మధురవాడ కుక్కల పునరావాస కేంద్రానికి తరలించి శస్త్రచికిత్సల అనంతరం వదిలిపెట్టనున్నారు.

వివాహిత అదృశ్యం


లింగాల ధనలక్ష్మి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు భోగాపురపు వారి వీధికి చెందిన లింగాల ధనలక్ష్మి (23) అనే వివాహిత సోమవారం ఇంటి నుంచి అదృశ్యమయింది. విజయనగరం జిల్లా బలిజిపేట మండలం పలగర గ్రామానికి చెందిన గుడివాడ బాబూరావుకు ధనలక్ష్మితో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తున్న బాబూరావు, ధనలక్ష్మితో తగరపువలసలో కాపురం పెట్టారు. సోమవారం ఉదయం బాబూరావు ఉద్యోగానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా ఇంటి వద్ద భార్య కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

పలు ప్రాంతాల్లో ఫాగింగ్

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డులో మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఫాగింగ్ చేయిస్తున్నామని పేర్కొన్నారు. పరిసరాల్లో చెత్త లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొమ్మాది: డెంగ్యూ, మలేరియా కట్టడికి చేపడుతున్న చర్యల్లో భాగంగా జీవీఎంసీ 4వ వార్డులో ఫాగింగ్ చేపట్టారు. ఉప్పాడ, చేపలదిబ్బడపాలెం ప్రాంతాల్లో మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు పర్యవేక్షణలో ఫాగింగ్ నిర్వహించారు.

పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా


కృష్ణంరాజుపేట వద్ద మహరాజుపేట - పద్మనాభం రహదారిపై నిలిచిన నీరు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన తాగునీటి పైప్‌లైన్ శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట వద్ద విరిగిపోయింది. దీంతో కొంత కాలంగా ఈ ప్రాంతంలో రహదారి చెరువులా మారిపోతోంది. అంతేకాకుండా రోజుల తరబడి నిలిచిన నీటితో బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా నివసిస్తున్న వారు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన పైప్‌లైన్ కారణంగా మజ్జివలసలో తాగునీటికి ఇబ్బందులు పడుతుండగా, శింగనబంద పంచాయతీ ప్రజలు రహదారిపై నిలిచిన నీటితో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

భీమునిపట్నం: ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికవడంతో మంగళవారం పాఠశాల వద్ద అభినందించారు. పి.ఆదిత్య, ఎం.గురుచరణ్, బి.రామ్‌తేజ, ఎం.తేజేష్, కె.కార్తిక్, పి.వంశీకృష్ణ, ఎ.ప్రణీత్, జి.చైతన్య, ఎ.తేజ తదితరులు ఎంపిక కాగా ఈ నెల 27న యలమంచిలిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. వీరిని కరస్పాండెంట్ పి.ఎ.విజయకుమారి అభినందించారు. సిబ్బంది పి.ఎస్.చంద్, ఎం.సారాశాంతి, రాంబాబు పాల్గొన్నారు.

సులువైన పద్ధతిలో బోధనకు కృషి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

మధురవాడ: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే పద్ధతిలో పాఠాలు బోధించాలని జిల్లా డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషోపాధ్యాయులు, ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లాలో గణితం బోధించే ఉపాధ్యాయులకు ఎంఆర్‌పీలు ఇస్తున్న శిక్షణ తీరు, అందులోని అంశాలు పరిశీలించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన జరగాలని సూచించారు. ట్యాబ్స్ వినియోగంతోపాటు సమయపాలన చాలా ముఖ్యమన్నారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లల అటెండెన్స్‌తోపాటు ఎండీఎం బిల్లులు సకాలంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ ఎమ్.కృష్ణకుమార్, విశాఖ ఎంఈవో ప్రేమకుమారి, చంద్రంపాలెం హెచ్‌ఎం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అభినందనలు


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో రమణ

పద్మనాభం: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికైన ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎంఈవో పొన్నగంటి రమణ మంగళవారం పాఠశాలలో అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల సింహాచలంలో నిర్వహించిన అండర్ – 14 హ్యాండ్‌బాల్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని కె.దివ్య, టి.చరణ్, అండర్ – 17 హ్యాండ్‌బాల్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి ఎస్.కిశోర్, 9వ తరగతి విద్యార్థిని ఎం.హిందూ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్.రవికుమార్, రెడ్డిపల్లి శంకరరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాలు


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్

ఆనందపురం : నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ విషయంపై అందరికీ యువత అవగాహన కలిగించాలని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ సూచించారు. మండలంలోని గొట్టిపల్లిలో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల వాహనాల రాకపోకలను గమనించడానికి అవకాశం లేకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతి వేగం, వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

న్యాయ సేవాధికార సంస్థతో ఉచిత సేవలు


న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శేషమ్మ

ఆనందపురం : సామాన్య ప్రజలకు న్యాయం చేయడానికి న్యాయ సేవాధికార సంస్థలు పనిచేసి ఉచితంగా సేవలు అందిస్తాయని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎం.వి.శేషమ్మ చెప్పారు. మండలంలోని వేములవలస సచివాలయంలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి శేషమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం న్యాయ సేవలు పొందడం ప్రతి ఒక్కరి హక్కు అని చెప్పారు. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి అందరికీ అవగాహన కల్పించే బాధ్యత ప్రజా ప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ అసంఘటిత రంగంలోని కార్మికులకు పనికి తగ్గ వేతనం లభించనప్పుడు కార్మిక శాఖను సంప్రదిస్తే కనీస వేతన చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ ఏడీ బి.విజయ్ ప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యారత్నప్రభ, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరాడ రాంబాబు, కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

పద్మనాభం: పేదలు, వృద్ధులు, కార్మికులు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ ఈ – శ్రమ్ కార్డుల ఉపయోగాన్ని వివరించారు. భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా సేవలను వివరించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ ప్రసాద్, ఏవో ఎంపీఎస్ చలం, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ


గొల్లల తాళ్లవలసలో గణపతిని దర్శించుకున్న ముత్తంశెట్టి మహేష్, కమిటీ సభ్యులు

తగరపువలస: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో అక్కరమాని అప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రారంభించారు. అనంతరం మండపంలో గణేషుడిని దర్శించుకున్నారు. అక్కరమాని రమణ, కొంగరాని ఎర్రాజీ, రాంబాబు, కె.శ్రీనివాసహరి, చిన్న, జి.శివ, ఎ.నరసింగరావు, కె.సత్యనారాయణ, సాయికృష్ణ, ఎల్.సూరిబాబు పాల్గొన్నారు. టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలో శ్రీరాధాకృష్ణ యాదవ యూత్ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆనందపురం : చందక గ్రామంలో వినాయక ఉత్సవాలు సందర్భంగా మంగళవారం మూడు వేల మందికి అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రారంభించారు. సర్పంచ్ బంక శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మాజీ సర్పంచ్ గుసిడి వెంకట రమణ పాల్గొన్నారు.

పద్మనాభం: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శేరిఖండంలో మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సర్పంచ్ పల్లంటి చిన్నారావు, రెడ్డిపల్లి అప్పల కృష్ణ, రెడ్డిపల్లి శంకరరావు పాల్గొన్నారు.

దేశంలో అత్యధికుల మాతృభాష హిందీ


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

తగరపువలస: దేశంలో అత్యధిక జనాభా మాట్లాడే భాషతోపాటు అత్యధికుల మాతృభాష హిందీ అని భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.దుర్గాప్రసాద్ అన్నారు. హిందీభాష పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ


పతకాలు సాధించిన బాలురను అభినందిస్తున్న వార్డెన్ రమేష్ తదితరులు


బంగారు పతకం సాధించిన కేశవర్ధన్‌తో రమేష్

- మధురవాడ బీసీడబ్ల్యూహెచ్‌సీ బాలురకు ఆరు పతకాలు

మధురవాడ: రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో మధురవాడ కరెంటు ఆఫీసు సమీపంలోని సమీకృత బాలుర వసతి గృహానికి చెందిన ఆరుగురు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 3వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ సీనియర్ మెన్, వుమెన్, జూనియర్ బాల, బాలికల పోటీల్లో మహేంద్ర, లక్ష్మణ్ బంగారు పతకాలు, బాబి, హర్ష, సుశాంత్, సూర్యప్రకాశ్ కాంస్య పతకాలు కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను మంగళవారం సాయంత్రం వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ రమేష్, పి.సురేంద్రనాథ్, ఎం.సరోజిని అభినందించారు.

తగరపువలస: ఇటీవల చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ జూనియర్స్ పోటీల్లో శ్రీబాసర విద్యాసంస్థలకు చెందిన రాయపురెడ్డి కేశవర్ధన్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథునికి విశేష పూజలు



అలంకరణలో విజయగణపతి, వుడా కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ : మధురవాడ, వుడా కాలనీ, రేవళ్లపాలెం, స్వతంత్రనగర్, వాంబేకాలనీ, ఆర్‌జీకే కాలనీల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మిథిలాపురి వుడా కాలనీలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీకృష్ణ, దుర్గాప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. మధురవాడ గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో స్వామికి సహస్ర లక్ష పత్రి పూజ, చతుర్వేద పారాయణ, హారతి సేవలు నిర్వహించారు. 30న మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ, ఉత్సవమూర్తులు, నవరాత్రి కళశ ఊరేగింపు ఉంటుందని చెప్పారు.